సాక్షి ప్రకాశం

ఆదివారం | 28 | మే | 2023



భోజనం తినేలోపే విగతజీవిగా మారాడు!
ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతిచెందిన ఘటన పామూరు మండలం కోడిగుంపల సమీపంలో జరిగింది. - 8లో..



నిబంధనల మేరకే అబార్షన్లు చేయాలి
నిబంధనల మేరకే అబార్షన్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
40 /29

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీలను గుర్తించాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ లబ్ధిదారుల ప్రకృతి వ్యవసాయం గురించి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో 828 మంది ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు రైతు సాధికారిత సంస్థ ఎస్సీ కార్పొరేషన్‌కు లబ్ధిదారుల జాబితాను అందజేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిశీలన చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.82.80 లక్షలను ప్రభుత్వం అందజేసినట్లు వివరించారు. ప్రభుత్వ సహాయాన్ని నిజమైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం

- పుల్లలచెరువు గిరిజనగూడెంలో మంత్రి ఆదిమూలపు సురేష్



సంప్రదాయ వస్త్రాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న గిరిజనులు

పుల్లలచెరువు: ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని, దీంతో పాటు గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం పుల్లలచెరువు సచివాలయం-2 పరిధిలోని తండాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి నవరత్న పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతో మంది గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు. ఈ రోజు ప్రతి తండాలో ఉద్యోగులు ఉన్నారంటే జగనన్నకు సలాం చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి ఈ ప్రభుత్వంలోనే జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి మద్దతు పెరగడంతో టీడీపీ నాయకులకు నిద్రలేకుండా పోయిందని అన్నారు. గిరిజన తండాలో నీటి సమస్య ఉందని, విద్యుత్ సక్రమంగా ఉండడం లేదని చెప్పడంతో వెంటనే గిరిజనులకు మంచినీటి బోరు వేయాలని అధికారులను ఆదేశించారు. తండాలో ఎక్కడా విద్యుత్ సమస్య రాకుండా చూడాలన్నారు. తండాలోని గిరిజనులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ముందుగా తండాలోని గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తులతో నాట్యం చేసుకుంటూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, డీడీవో సాయికుమార్, తహశీల్దార్ దాసు, ఎంపీడీవో రాజ్యలక్ష్మీ, ఈవోఆర్‌డీ బాలునాయక్, ఎంపీటీసీ రాములు, మండల సచివాలయ కన్వీనర్ డీ వెంకటేశ్వర్లు, నాయకులు జానికిరఘు, ప్రసాద్, కాశయ్య, నారాయణనాయక్, లక్ష్మానాయక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రాచీన యుద్ధ విన్యాస క్రీడ కర్రసాముకు పూర్వ వైభవం
- పూర్వం పల్లెల్లో సాయంత్రమైతే కర్రసాము శిక్షణతో యువకుల సందడి
- తర్వాత కాలంలో యువతులు కూడా ఆరితేరారు
- ఆధునిక క్రీడలతో దీటుగా సిలబం
- జిల్లాలో మార్కాపురంలో నిరంతరం ప్రత్యేక శిక్షణ
- రాష్ట్రస్థాయిలో మెరుస్తున్న వైనం



కర్రసాము శిక్షణ పొందుతున్న యువత





కుంగ్‌ఫూను పోలిన స్టైల్స్ ఇందులో ఉంటాయి. 12 నుంచి 15 రకాల స్టైల్స్ ఉంటాయి. సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్, సింగిల్, డబుల్ హ్యాండ్‌లతో రకరకాల విన్యాసాలు చేస్తారు. కర్రను గుండ్రంగా గాలిలో తిప్పుతూ చేసే విన్యాసం ఎక్కువగా నేర్చుకుంటున్నారు.

ప్రాచీన కళ.. మళ్లీ తళ..తళ

సండే స్పెషల్

కర్రను రెండు చేతులతో పట్టుకుని లయబద్ధంగా అటు..ఇటూ తిప్పుతూ..రివ్వు మంటూ గాల్లో ఎగురుతూ కర్రతో చేసే విన్యాసాలు చూస్తే ఆ కిక్కే వేరబ్బా..

స్వీయ రక్షణలో ప్రాచీన యుద్ధ క్రీడ కర్రసాముది కీలక భూమిక . రాచరిక పాలనలో దీని వైభవం ఆబాల గోపాలం విస్తరించింది. కత్తిసాముతో సమానంగా అలరారింది ఈ క్రీడ. యుక్తి.. శక్తులు ప్రదర్శించే నైపుణ్యం సంపాదించేందుకు ఈ విద్యలో ఆరితేరడం అప్పట్లో సాధారణం. అనుక్షణం అప్రమత్తంగా, ఏకాగ్రతగా ఉంటూ సాధన చేయాలి. నాడు వెలుగొందిన కర్రసాము (సిలబం) కాలంలోని వేగాన్ని అందుకోలేకపోయింది. ఆటలు, ఆచారాలు, ఆచరణలు అన్నిట్లోనూ మార్పులు సంతరించుకున్నాయి. ఇప్పుడు శారీరక వ్యాయామంగానే కాకుండా మహిళల ఆత్మరక్షణ కోసం ఉపయోగపడుతోంది. ప్రాచీన యుద్ధ క్రీడల్లో విశిష్టత కలిగిన దీనికి పూర్వ వైభవాన్ని తీసుకువస్తున్నారు మార్కాపురంలోని ఔత్సాహికులు...

సాక్షి డెస్క్, ఒంగోలు:

కర్రసాము ప్రాచీన యుద్ధ క్రీడ. వ్యక్తిగత భద్రత, సామూహిక రక్షణకు ఈ విద్య ఎంతగానో దోహదపడింది. పూర్వం రాజులు, సైనికులు, రాజ కుటుంబాల వారు నేర్చుకునే విద్య ఇది. అడవికి వేటకు వెళ్లినప్పుడు సింహాలు, పులులు, ఎలుగుబంట్ల నుంచి కాపాడుకునేందుకు కూడా కర్రసాము ఉపయోగపడేది. నిజాం రాజుల పాలనలో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లోని గ్రామాల్లో బందిపోట్లు, రజాకార్ల దాడుల నుంచి తప్పించుకునేందుకు గ్రామాల్లో అప్పట్లో కర్రసామే ప్రధాన ఆయుధంగా ఉండేది. ఒక వ్యక్తి కర్రసాము నేర్చుకుంటే 10 మందికి సమాధానం చెప్పగలడు. నేడు ప్రాచుర్యంలో ఉన్న కరాటే, కుంగ్‌ఫూ, జూడోలకు ఏ మాత్రం తీసిపోని విధంగా కర్రసాము రక్షణ కల్పిస్తోంది. 15 ఏళ్ల కిందట గ్రామాల్లో దసరా, సంక్రాంతి, ముఖ్య పండగల సమయంలో కర్రసామును రాత్రి పూట గ్రామ కూడలిలో ప్రత్యేక ప్రదర్శనగా ఏర్పాటు చేసే వారు. కర్రతో ఇరువురు వ్యక్తులు సాహసంగా చేసే ప్రక్రియ ఇది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కర్ర తిప్పే వేగంలో ఎక్కడైనా తగలవచ్చు. అనుక్షణం అప్రమత్తంగా, ఏకాగ్రతగా ఉంటూ కర్రసాము నేర్చుకోవాలి.

నాడు ఎంతో క్రేజీ..

కర్రసాము ఒకప్పుడు క్రేజీ క్రీడగా ఉండేది. ఈ విద్యపై పల్లెల నుంచి పట్టణాలు, పిల్లల నుంచి పెద్దల వరకు అమితాసక్తి ఉండేది. ఒకప్పుడు ఆత్మ రక్షణ కోసం ఆయుధంగా ఉండే కర్రసాము విద్యలో ప్రతి పల్లెలో సాయంత్రమైతే యువకులు, యువతులు వేర్వేరుగా శిక్షణ పొందే వారు. ఒకప్పుడు తెలుగురాష్ట్రాల్లో ఏ పల్లెకు వెళ్లినా కర్రసాము శిక్షణ కనిపించేది. ఆధునిక క్రీడలు రావడంతో ఇప్పుడు ప్రధాన పట్టణాలు, పల్లెల్లో ఆ యుద్ధ క్రీడ అంతర్ధానం అయిపోయింది. అయితే ఇప్పటికీ అటవీ ప్రాంతాల్లో నివశించే తండాల్లో అక్కడి వృద్ధులు ఈ కర్రసాము విద్యను తమ భావితరాలకు నేర్పిస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ క్రీడను గుర్తించింది. నేటి తరాలకు దీనిపై మక్కువ పెంచేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు కూడా నిర్వహిస్తోంది.



విద్యార్థులకు కర్రసాముపై శిక్షణ

ప్రాచీన క్రీడకు ప్రాచుర్యం

దాదాపుగా అంతరించిపోయిన ప్రాచీన క్రీడ కర్రసాము శిక్షణకు మార్కాపురం వేదికగా మారింది. మార్కాపురంలో కోచ్‌లు కాళంగి శ్రీనివాసులు, రాంబాబు కర్రసాములో సుమారు 150 మంది శిక్షణ పొందుతూ, నేర్పుతూ ప్రదర్శనలు ఇస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రస్తుతం వీరి దగ్గర 25 మంది చిన్నారులు, పెద్దలు శిక్షణ పొందుతుండగా, 125 మందికి పైగా శిక్షణ పొందారు. కర్రసాము ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రధాన అంశంగా మారుతోంది. గతేడాది స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామమూర్తి క్రీడాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో సుమారు 20 మంది విద్యార్థులు కర్రసాములో శిక్షణ పొందడం విశేషం. 15 ఏళ్లుగా కనుమరుగైన క్రీడను రెండేళ్ల నుంచి కాళంగి శ్రీనివాసులు బృందం వెలుగులోకి తీసుకొచ్చి పలువురికి శిక్షణ ఇస్తూ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు బీజం వేశారు. గతంలో పిఠాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు కర్రసాము శిక్షకుడు తాళ్లూరు రాంబాబు నేతృత్వంలో విద్యార్థులు వెళ్లి రెండో స్థానాన్ని సాధించారు.



ప్రాచీన యుద్ధ క్రీడను వెలుగులోకి తెస్తున్నాం



ప్రాచీన యుద్ధ క్రీడ కర్రసామును వెలుగులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. కర్రసాము ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. గతంలో రాజులు ఈ క్రీడను స్వయంగా నేర్చుకుని ప్రోత్సహించారు. 15 ఏళ్ల నుంచి ఈ క్రీడ గ్రామాల్లో కూడా కనుమరుగై పోతున్న నేపథ్యంలో మళ్లీ వెలుగులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో పలువురికి శిక్షణ ఇస్తున్నాం. ఎవరైనా నేర్చుకోవచ్చు. కేవలం నెల రోజుల వ్యవధిలో ఈ క్రీడను నేర్పిస్తాం.

– కాళంగి శ్రీనివాసులు, కర్రసాము శిక్షకుడు, మార్కాపురం

విద్యార్థులకు ఉపయోగం



కర్రసాము విద్యను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తించింది. ఐదేళ్ల నుంచి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. శిక్షణ తీసుకోవడం వలన విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెరుగుతుంది. దీంతో పాటు మంచి శారీరక శ్రమ కూడా లభిస్తుంది.

– తాళ్లూరి రాంబాబు, కోచ్, మార్కాపురం

కర్రసాము అంటే ఇష్టం



నేను ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో 9వ తరగతి చదువుతున్నా. కర్రసాము అంటే ఇష్టం. వేసవి సెలవులను వృథాగా గడపకుండా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి వచ్చి నేర్చుకుంటున్నాను. శిబిరం అయిపోయిన తర్వాత కూడా సాధన కొనసాగిస్తాను. నేర్చుకునేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కర్ర తగులుతుంది. ఏకాగ్రతతో ఈ విద్యను నేర్చుకోవాలి.

– నిషిత, 9వ తరగతి, మార్కాపురం

చాలా ఇంట్రెస్ట్‌గా ఉంది



అందరూ కరాటే, కుంగ్‌ఫూ నేర్చుకుంటున్నారు. నాకు మాత్రం ఇక్కడికి వచ్చిన మొదటి రోజు కర్రసాము నేర్పుతుంటే చూశాను. చాలా ఇంట్రెస్ట్‌గా ఉంది. దీంతో నేను కూడా కర్రసాము నేర్చుకునేందుకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం వస్తున్నా. పెద్దయిన తర్వాత కూడా ఈ విద్యను కొనసాగిస్తా.

– ప్రశాంత్, మార్కాపురం

క్రీడలకు ప్రోత్సాహం

- వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీమంత్రి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి తదితరులు

ఒంగోలు: క్రీడాకారులన్నా, క్రీడలన్నా తనకు ఎంతో ఇష్టం అని.. క్రీడాకారులకు ఎల్లప్పుడూ తనవంతు సాయం అందిస్తూ ప్రోత్సహిస్తూనే ఉంటానని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ థెరెస్సా ఉన్నత పాఠశాల ఆవరణలో నీలంపాలెం ఆర్‌సీఎం యూత్ ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన బాలినేని, ఇతర అతిథులకు నిర్వాహకులు పి.బాలు, కె.కరుణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మాజీ నగర అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం బాలినేని క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తాను సైతం కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనావెంకట్రావు మాట్లాడుతూ యువతలో జోష్ నింపేందుకు ఆర్‌సీఎం యూత్ క్రీడాపోటీల నిర్వహణకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ అభిమానించే వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకునే తత్వం బాలినేనిదన్నారు. సింగరాజు వెంకట్రావు అనారోగ్యానికి గురైనప్పుడు వెంకట్రావును కాపాడుకునేందుకు బాలినేని పడిన తపన ప్రతి ఒక్క కార్యకర్త, అభిమాని గమనించాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఫాదర్ పాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జాలాది మణిబాబు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఎందేటి రంగారావు, ఈదర చిన్నారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కటారి శంకర్, కావాటి రవికుమార్, చింతగుంట్ల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై తహసీల్దార్ విచారణ


విచారిస్తున్న తహసీల్దార్

తర్లుపాడు: తన పొలాన్ని అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారంటూ మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు తర్లుపాడుకు చెందిన ఇండ్ల ఏసేబు ఈ నెల 24న చేసిన ఫిర్యాదు మేరకు శనివారం తహసీల్దార్ డి. వరకుమార్ విచారణ జరిపారు. తన పొలాన్ని గ్రామానికి చెందిన వలంటీర్ తన కుటుంబ సభ్యుల పేరుపై మార్చుకున్నారని ఫిర్యాదు అందింది. తహసీల్దార్ స్టేట్ మెంట్ రికార్డులు చేశారు. భూ యజమాని ఇండ్ల బాలయ్య మాట్లాడుతూ తన తండ్రి పెద్ద యలమందకు లక్ష్మక్కపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 41లో 2.98 సెంట్ల భూమికి సుమారు 40 సంవత్సరాలు క్రితం ప్రభుత్వం పాస్ బుక్‌లు అందజేసిందని తెలిపారు. అయితే తమ బంధువైన ఇండ్ల ఏసేబు ఆ పొలాన్ని అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో గత ఏడాది స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన తహసీల్దార్‌లు గ్రామానికి వచ్చి భూమిని పరిశీలించి చుట్టూ పక్కల రైతులతో మాట్లాడి తనతో పాటు తన తమ్ముడి పేరుపై ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. వలంటీర్ మాట్లాడుతూ తన బంధువైన ఏసేబు ఏసెబు ఇ- క్రాప్ కోసం పత్రాలు తీసుకుని సంతకాలు పెట్టించుకున్నట్లు తనపై సబ్ కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏసేబు మాట్లాడుతూ తన వాటాను తన అన్న కుమారులు అక్రమంగా పొందారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

పొన్నలూరు: మండలంలోని ఉప్పలదిన్నె ఎస్సీ కాలనీలో మన్నెం మాలకొండయ్య (82) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. వారం రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలకు అస్వస్థతకు గురై శనివారం మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు.


మన్నెం మాలకొండయ్య (ఫైల్)

భోజనం తినే లోపే విగత జీవిగా మారాడు!


మృతుడు వేమూరి మదన్ (ఫైల్)


మృతుడు వేమూరి మదన్


మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న గ్రామస్తులు

● ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

పామూరు: 'అయ్యా భోజనం తిని వెళ్లయ్యా' అని కోరిన తల్లి మాటలే చివరివయ్యాయి. మళ్లీ వస్తానంటూ వెళ్లిన విద్యార్థి శాశ్వతంగా కన్ను మూశాడు. ఈత కోసం వెళ్లిన బీటెక్ విద్యార్థి క్వారీ నీటిలో పడి మృతి చెందిన ఘటన శనివారం కోడిగుంపల సమీపంలోని ఓ క్వారీలో చోటుచేసుకుంది. వేమూరి మదన్ (20)విజయవాడ లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామం కోడిగుంపల వచ్చాడు. శనివారం స్నేహితులతో కలిసి ఈత నేర్చుకునేందుకు క్వారీలోకి దిగాడు. నీటిలోకి జారిపోతుండగా స్నేహితులు అతనిని రక్షించేందుకు యత్నించి విఫలమయ్యారు. వెంటనే గ్రామంలోకి వెళ్లి చెప్పి గ్రామస్తులను క్వారీ వద్దకు తీసుకువచ్చి మదన్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని కోడిగుంపల గ్రామం తరలించారు. తల్లి వేమూరి కళావతి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. అన్నంతినమని తల్లి కోరగా.. ఈతకు పోతున్నానని కాసేపట్లో వచ్చి తింటానని చెప్పి వెళ్లాడు. కానీ కుమారుడికి భోజనంపెట్టి తాను తినేందుకు ఎదురు చూస్తున్న కళావతి.. ఒక్కసారిగా మరణవార్త విని కుప్పకూలిపోయింది.

గ్రామంలో విషాదఛాయలు

వేమూరి అయ్యన్న, కళావతిల ఏకైక కుమారుడు మదన్ మరణంతో కోడిగుంపల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కష్టపడి వ్యవసాయం, బట్టల వ్యాపారం చేసుకుని జీవిస్తూ కుమారుడిని చదివిస్తున్న వారు గ్రామంలో అందరికి తలలో నాలుకలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వేసవి సెలవులకు వచ్చి, అప్పటిదాకా అందరితో కలిసి ఉండి అంతలో ఈత సరదాతో మృత్యువాత పడటంతో స్నేహితులు జీర్ణించుకోలేక పోతున్నారు. కాగా తరచూ ప్రమాదలు జరుగుతున్నా క్వారీల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం బాధాకరం.

కారు ఢీకొని కొరియర్ బాయ్ దుర్మరణం

వరికుంటపాడు (నెల్లూరు): ఓ పార్శిల్ డెలివరీ చేసేందుకు వెళ్లిన కొరియర్ బాయ్‌ను కారు వేగంగా ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన శంషుద్దీన్ (30) కొరియర్ ఇచ్చేందుకు వరికుంటపాడు వెళ్లాడు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆగి కస్టమర్‌కు ఫోన్ చేస్తుండగా దుత్తలూరు వైపు నుంచి పామూరు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పామూరు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ఎస్సై విజయ్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రిపురాంతకంలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై సైదులు

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని నాగరాజు కాలనీ సమీపంలో చోరీ జరిగిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికంగా నివాసం ఉంటున్న రిటైర్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నయీమ్‌బేగ్ భార్యతో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 21వ తేదీ హైదరాబాద్ వెళ్లారు. శనివారం తిరిగి వచ్చి చూడగా, ఇంటి తలుపులు పగలగొట్టి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలైన చెవి రింగులు ఒక జత, చెవి టాప్స్ నాలుగు, మెడలో వేసుకునే ఒక కాసు, ఒక జత వెండి పట్టీలు కనిపించలేదు. ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు ఇంటి వెనుక తలుపు పగలగొట్టి లోనికి ప్రవేశించి సుమారు రూ.20 వేల విలువైన సొత్తు చోరీ చేసినట్లు తెలిపారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై జీవీ సైదులు తెలిపారు.

నిబంధనల మేరకే అబార్షన్లు చేయాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి


శిక్షణ పొందిన వైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనలకు లోబడి చట్టప్రకారం మాత్రమే అబార్షన్లు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి పీహెచ్‌సీల డాక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అబార్షన్ కేర్ సేవల్లో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను నాలుగు బృందాలుగా విభజించి మూడు రోజుల పాటు ఒంగోలు జీజీహెచ్‌లో శిక్షణ ఇచ్చారు. జీజీహెచ్ ప్రసూతి విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి సహకారం అందించగా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ పద్మజ, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ మాతృ మరణాలు సంభవించకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యాధికారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ చికిత్సలో శిక్షణ పొందిన ఎంఎల్‌హెచ్‌పీలకు కూడా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లాయర్ మృతి


మృతుడు శ్రీరామ్

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న యువ లాయర్ మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. త్రిపురాంతకం మండలం బీఆర్ జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బైక్‌పై గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న గుంటూరు పట్టాభిపురానికి చెందిన యువ లాయర్ షణ్ముఖ శ్రీరామ్ (27), సురేంద్రబాబులను గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొట్టింది. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే శ్రీరామ్ మృతిచెందాడు. సురేంద్రబాబు చికిత్స పొందుతున్నాడు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవీ సైదులు తెలిపారు.